క్లుప్తంగా

నేడు భూత్పూర్‌కు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాక

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కప్పెట గ్రామానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గ్రామసభకు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో పాటు మంత్రి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పూలే ఐకాన్ అవార్డుకు ఎంపిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అభిలాష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కేంద్రం సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీ లక్ష్మీనారాయణ స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌కు సావిత్రి భాయి పూలే ఐకాన్ అవార్డు లభించింది. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నేడు ప్రేరణ సమావేశం

జడ్చర్ల టౌన్: మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మంజులాదేవి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీఈఓ ప్రవీణ్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు.

నేడు జీవీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

మహబూబ్‌నగర ఎడ్యుకేషన్: ఎస్టీలకు మంత్రి పదవి ఇవ్వాలని బుధవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటితో పాటు అన్ని జిల్లాల్లో ఎస్టీ హాస్టల్స్, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, విడుదల చేయాల ని, తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చుదాం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బాల్యవివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాను బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మథామస్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో బాల్యవివాహాలను నిర్మూలించేందుకు పని చేస్తున్నట్లు తెలిపారు.

ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: గత ఎన్నికల్లో ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు వెంటనే అమలు చేయాలని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ హెల్త్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. ఏఎన్‌ఎం ట్రెనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్‌ఎం పోస్టుల్లో పదోన్నతి కల్పించాలన్నారు. ఇచ్చి న హామీ మేరకు ఏఎంసీ, పీఎంసీ తదితర టార్గెట్లను రద్దు చేసి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పాదయాత్రగా కలెక్టరేట్ వరకు చేరుకొని నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్, జిల్లా కోశాధికారి చంద్రకాంత్, ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు సావిత్రి, యాదమ్మ, పద్మ, అమృత, నిర్మల శివలీల, అనురాధ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జాతీయస్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ క్యాట్ లెవెల్-2 పరీక్షలో జిల్లా కేంద్రానికి చెందిన శ్రీ చైతన్య స్కూల్ బీఎస్‌ఎస్‌ఎల్ బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన 55 మంది విద్యార్థులు మంచి ప్రతిభ చాటారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ఏజీఎం భాస్కర్‌రెడ్డి, కో ఆర్డినేటర్ రఘుబాబు, అకాడమిక్ డీన్ మహేష్, సీ ఇన్‌చార్జి నౌషీన్, ఒలంపియాడ్ ఇన్‌చార్జి మేఘ ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గ్రామసభల ద్వారా సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక
- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్/దేవరకద్ర రూరల్/అడ్డాకల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు గ్రామ, వార్డు సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన ట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గ్రామసభలలో భాగంగా మండలంలోని జమిస్తాపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి వ్యవసాయయోగ్యం కాని భూములు, రేషన్ కార్డుల పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఆయా పథకాలకు సంబంధించి ప్రజలకు ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్లను సంప్రదించవచ్చని తెలిపారు. గ్రామసభలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఎంపీడీఓ కరుణశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

- దేవరకద్ర మండలంలోని లక్ష్మీపల్లి గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భ రోసా పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఆ యా పథకాలకు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారితో పాటు, లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుంచి ఆర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియ

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ విజయేందిర బోయి స్పష్టం చేశారు. మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, గిర్దావర్ అరుణ్, ఏపీఎం చారి ఉన్నారు.



మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

అర్హుల గుర్తింపు కోసమే వార్డుసభలు

మహబూబ్‌నగర్ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసేందుకు వార్డుసభలను నిర్వహిస్తుందని మహబూబ్‌నగర్ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ కేసిరెడ్డి దేవేందర్ అన్నారు. అర్బన్ మండల పరిధిలోని బోయపల్లి రెవెన్యూ వార్డు సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోతీలాల్, మాజీ కౌన్సిలర్ శరత్, గిర్దావర్ నర్సింగ్ పాల్గొన్నారు.

మొదటిరోజు విజయవంతంగా గ్రామసభలు

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, రేషన్‌కార్డుల కోసం మండలంలో 16 గ్రామ, వార్డు సభలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో 22, 23, 2, 4, 6, 7, 5, 1వ వార్డులో మొత్తం 8వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి సభలకు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్లకోసం 156, రేషన్‌కార్డుల కోసం 552 మంది కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారు. ఖానాపూర్, దేవునిగుట్టతండా, కొత్తతండా, పోచమ్మగడ్డతండా, నేలబండతండా, కుర్వగడ్డపల్లి, కిష్టారం, మర్రిచెట్టుతండా, మాటుబండతండా, కొండేడ్, రామస్వామిగుట్టతండా, తంగెళ్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

దరఖాస్తుల వెల్లువ..

జడ్చర్ల మండలంలోని గ్రామ సభలలో ఇందిరమ్మ ఇళ్లకు 191 దరఖాస్తులు వచ్చాయి. రేషన్‌కార్డులకు 342, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 32, రైతు భరోసాకు 3 దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభలను ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీఓ సరోజ, ఏఓ గోపినాథ్, డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

- మిడ్జిల్ మండలంలోని వేముల, సింగందొడ్డి, దోనూర్, వెలుగొమ్ముల, కొత్తూర్, బైరంపల్లి గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించారు. ఆత్మీయ భరోసాకు13, ఇందిరమ్మ ఇళ్ల కోసం 77, కొత్త రేషన్ కార్డుల కోసం 153 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు.

పారదర్శకంగా గ్రామసభల నిర్వహణ

భూత్పూర్: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ మేనేజర్ శంకర్ అన్నారు. 4వ వార్డులో నిర్వహించిన సభలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల అర్హుల జాబితాను ప్రజల ముందు గ్రామసభలో చదివి వినిపించారు. మున్సిపాలిటీలోని 4,5,8 వార్డుల్లో గ్రామసభలు నిర్వహించారు. కౌన్సిలర్ నాగమ్మ, జరీనా బేగం, మేనేజర్ శంకర్, ఏఈ వినోద్, టీం లీడర్లు ప్రసాద్‌బాబు, వనజ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

గ్రామసభల్లో నిలదీతలు



నవాబుపేట: ప్రజాపాలన గ్రామసభల్లో మొదటి రోజు నిలదీతలు, వాగ్వివాదాలతో ముగిశాయి. కొల్లూర్ గ్రామసభలో అధికారులు లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తుండగా, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు అర్హుల పేర్లు రాలేదని నిలదీశారు. అధికార పార్టీ నాయకులు వారితో వాగ్వివాదానికి దిగారు. చివరికి జాబితాలో పేర్లు లేనివారు మరోసారి దరఖాకాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆత్మీయ భరోసాలో ఒక్కరికే చోటు

కూచూర్‌లో వందమంది ఆత్మీయ భరోసాకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలన పేరుతో కేవలం ఒక్కరినే అర్హులుగా గుర్తించారు. చాలా మంది అర్హులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే ఎవరికీ రాలేదు. ఇళ్లు సైతం చాలా మంది లబ్ధిదారులను రాలేదని అధికారులను నిలదీశారు.

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డు ఇస్తామని మున్సిపల్ చైర్మన్ ఏ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. 16, 21వ వార్డుల్లో ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడారు. పేదలకు తప్పక ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. మొదటిరోజు 1, 3, 8, 12, 16, 22, 24, 26, 43, 45, 48 వార్డులలో సభలు కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, కౌన్సిలర్లు రోజా, రామాంజనేయులు, మోతీలాల్, మహమ్మద్ అబ్దుల్ రషీద్, ముస్కాన్ సుల్తానా, బురుజు సుధాకర్‌రెడ్డి, మంగి మాధవీలత, నాజియాబేగం, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, టీపీఓ లక్ష్మీపతి, ఏఎస్ఓ సలీం పాల్గొన్నారు.

మొదటి రోజు సజావుగా..

జిల్లాలోని పాలమూరు, భూత్పూర్, జడ్చర్ల పట్టణాలలో మొ దటిరోజు వార్డు సభలు సజావుగా సాగాయి. తా జాగా మొత్తం 3,471 దరఖాస్తులు వచ్చాయి. వా టిలో మహబూబ్‌నగర్‌లో 12 వార్డుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 885, కొత్త రేషన్‌కార్డుల కోసం 1,716, రైతు భరోసాకు 6, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 5 దరఖాస్తు చేసుకున్నారు. భూత్పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 69, కొత్త రేషన్ కార్డులకు 88, జడ్చర్ల పట్టణంలో 8వార్డుల నుంచి ఇళ్ల కోసం 69, కొత్త రేషన్‌కార్డుల కోసం 88 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కేంద్రంలోని 21వ వార్డు శేషాద్రినగర్‌లో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, 24వ వార్డులోని రామయ్యబౌళిలో ఆర్డీఓ ఈ.నవీన్, 43వ వార్డులోని రాంనగర్‌లో మున్సిపల్ క మిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.



బోయపల్లి సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్

రెండోరోజు వార్డు సభలు ఇక్కడే..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో రెండోరోజు బుధవారం మరో 12 వార్డులలో సభలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పద్మావతీకాలనీ (వార్డు నం.7) లోని మహిళా సంఘం కమ్యూనిటీ హాల్‌లో, క్రిస్టియన్‌పల్లి (వార్డు నం.10) లోని రెవెన్యూ కార్యాలయం, బండమీదిపల్లి (వార్డు నం.13) లోని రెవెన్యూ కార్యాలయం, వీరన్నపేట (వార్డు నం.14) లోని స్వామి వివేకానంద కమ్యూనిటీ హాల్, చిన్నదర్‌పల్లి (వార్డు నం.15) లోని ఆంజనేయ స్వామి ఆలయ మైదానం, దొడ్డలోనిపల్లి (వార్డు నం.17)లోని రెవెన్యూ కార్యాలయం, షాషాబ్‌గుట్టతండా (వార్డు నం.19) లోని మహిళా కమ్యూనిటీ హాల్, మర్లు (వార్డు నం.20) లోని బ్రైట్ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో, పాతపాలమూరు - జిల్లా జైలు సమీపం (వార్డు నం.25) లోని పీర్ల మసీదు వద్ద, బండ్లగేరి (వార్డు నం.28) లోని మహిళా కమ్యూనిటీ హాల్, వీరన్నపేట (వార్డు నం.32) లోని పాండురంగస్వామి ఆలయం సమీపంలో ఉన్న కమ్యూనిటీ హాల్, బోయపల్లి రోడ్ - ఎఫ్‌సీఐ గోదాం చౌరస్తా (వార్డు నం.35) వద్ద కొనసాగుతాయి.

వాస్తవ పరిస్థితులు చూడండి



రేకులచౌడాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రభుత్వం సూచించిన విధంగా నిబంధనలు కాకుండా గ్రామాల్లో వాస్తవ పరిస్థితులను అధికారులు చూసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్‌కార్డుల విషయంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి సూచించారు. రాజాపూర్ మండలంలోని కుత్నేపల్లి, బోడగుట్టతండా, రంగారెడ్డిగూడ, చెన్నవెల్లి గ్రామాలతో పాటు బాలానగర్ మండలంలోని పెద్దాయపల్లి, గుండేడ్ గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో గ్రామ సభలు పెట్టి ఎవరికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలనే నిర్ణయాన్ని, అధికారాన్ని ప్రజలకే అప్పగించిందన్నారు. ఎక్కడైనా అవినీతి జరిగిందని నా దృష్టికి వస్తే మా త్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవాబుపేట: అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండల పరిధి లోని రేకులచౌడాపూర్ గ్రామసభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాజాగా జాబితాలో రాని వారికి సైతం మ రోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

జిల్లా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా విష్ణుప్రియ



పాలమూరు: తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ విష్ణుప్రియను నియమించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకూరి రాంచందర్ నియామక పత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా రవికుమార్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు డాక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ విద్యార్థుల్లో పెరుగుతున్న విపరీత పోకడలకు మానసికంగా సరైన దృక్పథం లేకపోవడమే కారణమన్నారు. ప్రతి కళాశాలలో ఒక సైకాలజిస్ట్ నియమించడం వల్ల విద్యార్థుల ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు.

ఏనుగొండలో జంక్షన్ ఏర్పాటు చేయండి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏనుగొండ రెవెన్యూ వార్డులో అంబేద్కర్ చౌరస్తా దగ్గర జంక్షన్, సిగ్నల్ సిస్టం ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ (టీఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్-రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారిపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు రోడ్డు దాటుతున్న సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మార్పీఎస్ (టీఎస్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్, అనుపటి వెంకటయ్య, రాములు, భాస్కర్, వెంకటేష్, నర్సింహులు, గోపాల్, బాలమాసయ్య, నరేష్, కృష్ణ, రాఘవేందర్ పాల్గొన్నారు.

పాలమూరులో గుండె బైపాస్‌సర్జరీ

పాలమూరు: ఉమ్మడి పాలమూరులో ప్రణయ్ కార్డియాక్ కేర్ సెంటర్ ఆస్పత్రిలో మొదటి సారిగా గుండెకు బైపాస్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశామని కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రణయ్ కార్డియాక్ కేర్ సెంటర్ ఆస్పత్రిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైద్యుడు వివరాలు వెల్లడించారు. సత్యనారాయణగౌడ్ అనే 63 ఏళ్ల వ్యక్తికి బైపాస్ సర్జరీ చేసి సురక్షితంగా డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో కార్డి యో థొరాసిక్ సర్జరీ విభాగంలో పూర్తిస్థాయి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సునీత అనే మహిళకు కవటాల మార్పిడిలో భా గంగా బ్లాక్ అయిన వాటికి సర్జరీ చేయడం జ రిగిందన్నారు. గుండె సర్జరీ అయిన వారు మూ డు నెలల్లో కోలుకుని తిరిగి సాధారణ జీవితం గడుపుతారని తెలిపారు. ప్రణయ్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 1000వరకు యాంజియోగ్రామ్‌లు, 200వరకు స్టంట్‌లు వేసినట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిలో అన్ని రకాల విభాగాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు వివేక్ సాగర్, సుహాసిని, ఎస్.ప్రతిమ, నితిష పాల్గొన్నారు.

దేవరకద్ర అభివృద్ధే లక్ష్యం..



దేవరకద్రలో వీరప్పయ్య షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని నియోజకవర్గానికి కొత్త రూపురేఖలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. దేవరకద్రలో రూ. మూడున్నర కోట్లతో రాయచూర్ రోడ్డులో నిర్మించిన వీరప్పయ్య దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకద్రను మున్సిపాలిటీగా చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో చాలా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా ఆర్వోబీ నిర్మించడం వల్ల దేవరకద్ర పట్టణం రెండుగా చీలి పోయిందని, వ్యాపారాలు కుంటు పడ్డాయన్నారు. అండర్‌పాస్ నిర్మించాలని రైల్వే జీఎంను కలిసి చేసిన విజ్ఞప్తి మేరకు, అండర్‌పాస్ స్థానంలో సబ్‌వేను నిర్మిస్తామని లేఖ ద్వారా తెలిపారని, త్వరలో నిర్మాణం జరుగుతుందన్నారు. మరో పది రోజుల్లో ఇక్కడికి కోర్టు రాబోతుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ పక్క స్థలంలో నూతన డిగ్రీ కళాశాల భవనం నిర్మిస్తామన్నారు. దేవరకద్రకు 100 పడకల ఆస్పత్రి మంజూరైందని, రేపు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేస్తారన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలందిస్తాం

అడ్డాకుల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. అడ్డాకుల మండలం కందూర్‌లో ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కందూర్, వడ్డేపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి రామయ్య చెరువులో కృష్ణా జలాలకు పూజలు చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. లాల్‌కోటలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, రైతుభరోసా పథకాలపై నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభకు హాజరయ్యారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ భవనం, హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమాల్లో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ కతలప్ప పాల్గొన్నారు.

స్పౌజ్ బదిలీలపై పీఆర్టీయూ హర్షం



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పీఆర్టీయూ తెలంగాణ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 317 జీఓ ద్వారా ఇబ్బందులు పడిన బాధితులు ఇటీవల బదిలీలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై పీఆర్టీయూ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్‌లు మాట్లాడుతూ 317 జీఓ అనేది ఒక అనాలోచిత నిర్ణయమని, అనేక మంది ఉపాధ్యాయులు నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణం కాంగ్రెస్ ప్రభుత్వం వారికి బదిలీలకు అవకాశం కల్పించిందన్నారు. రాష్ట్రంలో 834 స్పౌజ్, 1000 మ్యూచువల్ బదిలీలకు అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. బదిలీల కోసం పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, జైపాల్‌రెడ్డి, భూపతిసింగ్, రాఘవేందర్, జైపాల్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, భీంరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: ఈనెల 25 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దామని సీపీఎం మండల కార్యదర్శి జగన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర మహాసభలకు పెద్దసంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సత్తయ్య, మున్నా, ఈర్లపల్లి యాదయ్య, జంగమ్మ, రాజ్, శ్రీశైలం, లక్ష్మమ్మ, వెంకటయ్య, శ్రీను, యాదమ్మలు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు విద్యానగర్ కాలనీలో రేణుకాఎల్లమ్మ ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, అలంకరణ చేశారు. లలితాసహస్రనామ పారాయణం చేయించారు. మహామంగళహారతితో వేడుకలు ముగించారు. వేడుకలకు విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి లావణ్య హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రాధాకృష్ణ, భక్తులు వెంకటలక్ష్మి, పద్మజ, మమత, అశ్విని, శిరీష పాల్గొన్నారు.



రేణుకాఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రేపు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడి రాక

జడ్చర్ల టౌన్: పట్టణంలోని అంబేద్కర్ కళాభవన్‌లో గురువారం డప్పుకళాకారులు, ఎమ్మార్పీఎస్ మండల సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ రానున్నట్లు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్యమాదిగ మంగళవారం వెల్లడించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేయిగొంతుకలు భారీ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కరాటే శ్రీను, వినోద్, యాదయ్య, రమేష్, ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను విస్మరిస్తే మూల్యం తప్పదు

- బస్సుయాత్రలో ఓయూ విద్యార్థి నాయకుడు శివరాంచంద్రన్



మాట్లాడుతున్న శివరాంచంద్రన్

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లను విస్మరిస్తే తగిన మూల్యం తప్పదని ఓయూ విద్యార్థి నాయకుడు శివరాంచంద్రన్ హెచ్చరించారు. రాష్ట్రంలో ముదిరాజ్‌ల ఐక్యతకోసం చేపట్టిన బస్సుయాత్ర మంగళవారం ఉదయం జడ్చర్ల నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిగ్నల్‌గడ్డపై పూలె, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50లక్షల ఓటర్లు ఉన్న ముదిరాజ్‌లను ప్రభుత్వం విస్మరిస్తోందని, ఎమ్మెల్యేలు, మంత్రులు కనీసం ముదిరాజ్‌ల సమస్యలపై నోరువిప్పలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 2వేలకోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈబీసీ వల్ల ముదిరాజ్‌లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తాను 119 నియోజకవర్గాలను విడతల వారీగా బస్సుయాత్ర కొనసాగిస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాకు ఉన్నతస్థానం ఉందని, ఎందరో ముదిరాజ్‌లు అమరులయ్యారన్నారు. వారిలో పండగసాయన్న, ఎర్రసత్యం, సింగోటం రామన్నలాంటి వారున్నారన్నారు. జడ్చర్లకు చేరుకున్న బస్సుయాత్రకు ముదిరాజ్‌సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మాజీ సర్పంచ్ రేణుక, నాయకులు పి.మురళి, కోళకృష్ణ, నర్సింహులు, జగదీశ్వర్, శివ, మురళి, జయపాల్, రవి ఉన్నారు.